ప్రజాశక్తి
బుధవారం 15 నవంబర్ 2023
5



అల్లూరి సీతారామరాజు

108లో ప్రసవం



108లో ప్రసవించిన గిరిజనమహిళ

ప్రజాశక్తి-పెదబయలు : మండలంలో అరడకోట పంచాయతీ చేరు వీధి గ్రామానికి చెందిన బొండా గీత మంగళవారం మొదటి కాన్పుకు పురిటినొప్పులు రావడంతో కుటుంబీకులు 108 వాహనానికి సమాచారమిచ్చారు. 108అంబులెన్స్‌లో ముంచింగిపుట్టు సిహెచ్‌సికి గీతను తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు తీవ్రం కావడంతో 108లోనేఅడ శిశువుకు జన్మనిచ్చింది తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని, తదుపరి పరీక్షలకు ముంచంగిపుట్టుసిహెచ్‌సికి తరలించినట్లు 108 పైలెట్ మజ్జి సతీష్, ఇఎన్‌టి వి.రవి తెలిపారు.



వరద ముంపులో అవస్థలు పడుతున్న పోలవరం నిర్వాసిత గ్రామాల ప్రజలు (ఫైల్‌ఫొటో)

ఆదివాసీలకు కేంద్రం తీవ్ర ద్రోహం

- గిరిజన చట్టాలు నిర్వీర్యం
- వంద శాతం ఉద్యోగ రిజర్వేషన్‌కు ఎసరు
- పోలవరం నిర్వాసితులకు అన్యాయం
- హైడ్రో పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రయత్నాలు
- అయినప్పటికీ ఎన్నో చేస్తున్నామని మోడీ సర్కారు ప్రచారార్భాటం
- వికసిత్ భారత్ సంకల్ప యాత్ర పేరిట గిరి గ్రామాల్లోకి ప్రవేశం

ప్రజాశక్తి - పాడేరు

ఆదివాసీలకు కేంద్రంలోని మోడీ సర్కారు అన్నింటా అన్యాయమే చేసింది. గిరిజన చట్టాలను నిర్వీర్యం చేసి అడవిని కార్పొరేట్లకు అప్పగించే కుట్రలు పన్నుతోంది. హైడ్రో పవర్ ప్రాజెక్టులు ఏర్పాటు చేసి ఆదివాసీలను నివాస ప్రాంతాలకు దూరంగా తరిమేసే యత్నాలను ముమ్మరం చేసింది. ఇప్పటికే జిఓ 3 రద్దయ్యేలా చేసి ఉద్యోగాలు లేకుండా అన్యాయానికి ఒడిగట్టింది. పోలవరం నిర్వాసితులను గోదాట్లో నిలువునా ముంచేసింది. ఇంతటి ద్రోహం చేసి నేడు ఎంతో చేస్తున్నామని ప్రచారం చేసుకునేందుకు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర పేరిట ఆదివాసీ గ్రామాల్లోకి అడుగు పెడుతోంది. ఈ యాత్రా బృందంలో పలువురు అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఉండనున్నారు. ఇలా కొత్త ప్రచారార్భాటానికి బిజెపి సర్కారు తెరతీయడంపై ఆదివాసీ సంఘాలు విమర్శలు గుప్పిస్తున్నాయి.

ఇప్పటికే మోడీ సర్కారు జిఓ నెంబర్ 3 ఉద్యోగ రిజర్వేషన్ రద్దయ్యేలా చేసింది. మూడేళ్లు అవుతున్నా పునరుద్ధరించకపోవడంతో ఆదివాసీ యువతీ, యువకులు తీవ్రమైన అన్యాయానికి గురవుతున్నారు. గురుకులం, ఏకలవ్య పాఠశాలల్లో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను గిరిజనేతరులతో భర్తీ చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా రాష్ట్ర గవర్నర్ ప్రేక్షకపాత్ర వహించడం శోచనీయం.

జిల్లాలోని పాడేరు, అరకు నియోజకవర్గాల్లో నాలుగు హైడ్రో పవర్ ప్రాజెక్టులను నిర్మించేందుకు కార్పొరేట్ కంపెనీలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. దీనిపై ఆదివాసీల్లో సర్వత్రా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ పవర్ ప్రాజెక్టులను నిర్మించే సంస్థల్లో అదానీ వంటి కార్పొరేట్లు ఉండటం గమనార్హం. వీరికి ప్రభుత్వం దాసోహమై గిరిజనులను నివాస ప్రాంతాలకు దూరం చేస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎర్రవరం పరిసర గ్రామాల ప్రజలు హైడ్రో ప్రాజెక్టుల నిర్మాణాలను వ్యతిరేకిస్తూ ఇప్పటికే పలు దఫాలు పోరాటాలు నిర్వహించారు. వారి గోడు కేంద్రానికి పట్టడం లేదు.

జిల్లాలో కొత్తగా నిర్మితమవుతున్న జాతీయ రహదారి వల్ల పలువురు బాధితులుగా మారారు. వారికి నష్టపరిహారం అందించకుండానే పనులు జరిగిపోతున్నాయి. తమ నివాస స్థలాలను, సాగు భూములను కోల్పోయి నిర్వాసితులైన గిరిజనులు తమకు నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. వాస్తవానికి విజయనగరం నుండి రాజమండ్రి వరకు గ్రీన్ ఫీల్డ్ హైవేకు ప్రభుత్వం అనుమతిచ్చింది. జిల్లాలోని అనంతగిరి, అరకు, డుంబ్రిగుడ, హుకుంపేట, పాడేరు, జి.మాడుగుల, జికె.వీధి, కొయ్యూరు, రాజవొమ్మంగి మండలాల్లో పనులు జరిగాయి. ఆయా చోట్ల ఆదివాసీలకు అన్యాయం జరిగినా ప్రభుత్వానికి పట్టలేదు.

కష్టాల్లో పోలవరం నిర్వాసితులు

పోలవరం జాతీయ బహుళార్థ సాధక ప్రాజెక్టు. సాగునీరు, తాగునీరు, విద్యుత్ ఉత్పత్తికి ఉద్దేశించబడింది. దీని నిర్మాణ బాధ్యతను రాష్ట్రంపై వదిలేసి కేంద్రం చేతులు దులుపుకుంటోంది. పునరావాస బాధ్యత తనది కాదని చేతులెత్తేస్తోంది. పునరావాసం, ప్రాజెక్టు నిర్మాణం ఆలస్యం కావడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ కారణం. ఫలితంగా నేడు పోలవరం నిర్వాసితుల కష్టాలపాలవుతున్నారు. ఈ ప్రాజెక్టుతో జిల్లాలోని దేవీపట్నం, విఆర్.పురం, చింతూరు, ఎటపాక, కూనవరం మండలాలు మునుగుతున్నాయి. ఈ ముంపును ప్రభుత్వం కాంటూరు స్థాయిలో లెక్కించి రెండు భాగాలుగా ముంపు జాబితా తయారు చేసింది. దీనిలో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరిగింది. గోదావరి వరదల వల్ల 2022లో పై మండలాల్లో ఊళ్లకు ఊళ్లు జలసమాధి అయ్యాయి. నిర్వాసితులకు పునరావాసం కల్పించిన తరువాతే ప్రాజెక్టు పనులు చేపట్టాల్సి ఉన్నా కేంద్రం ఆ పని చేయలేదు. పునరావాసం ఖర్చు అంచనా రూ.33,000 కోట్లు. కానీ కేంద్ర ప్రభుత్వం ఇచ్చింది రూ.7 వేల కోట్లు మాత్రమే. 2013 భూసేకరణ చట్టం ప్రకారం కల్పించాల్సిన కనీస సౌకర్యాలు కూడా ఏ పునరావాస కేంద్రంలోనూ లేవు.

నేడు అరకులోయలో గవర్నర్ పర్యటన

-జన జాతీయ గౌరవ్ దివస్‌లో ఉపన్యాసం



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ, ఇతర అధికారులు

ప్రజాశక్తి - పాడేరు

రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ బుధవారం అరకులోయలో పర్యటించనున్నారు. జన జాతీయ గౌరవ్ దివస్‌లో పాల్గొనేందుకు ఆయన ఇక్కడకు వస్తున్న నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. పాడేరు ఐటిడిఎ పిఒ వి.అభిషేక్ ఈ ఏర్పాట్లును మంగళవారం పరిశీలించారు. పలు సూచనలు చేశారు. హెలీప్యాడ్‌తో పాటు సభా వేదికను ఆయన పరిశీలించారు అదేవిధంగా గవర్నర్ విశ్రాంతి తీసుకునే రైల్వే అతిథి గృహంలో జరిగిన ఏర్పాట్లుపైనా ఆరా తీశారు.

గవర్నర్ పర్యటన ఇలా..

గవర్నర్ అబ్దుల్ నజీర్ ఉదయం 10 20 గంటలకు అరకులోయ రైల్వే గెస్ట్ హౌస్‌కు చేరుకుంటారు. కొంతసేపు విశ్రాంతి అనంతరం 11 గంటలకు బయలుదేరి అరకులోయలోని పెదలబుడు పంచాయతీకి వెళ్తారు. అక్కడి డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన జన జాతీయ గౌరవ్ దివస్ కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ కార్యక్రమం ముగిసిన తరువాత ఆయన విశాఖపట్నం బయలుదేరి వెళ్తారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ఆదివాసీలను మభ్యపెట్టేందుకే...

- వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రపై సిపిఎం ధ్వజం
- గవర్నర్‌ను రాజకీయ ప్రతినిధిగా వినియోగించడం తగదు
- మన్యవాసులకు శతశాతం ఉద్యోగాలపై స్పష్టతనివ్వాలి
- మోడీ పాలనలో విలాప భారత్‌గా మారిందని ఆక్షేపణ
- సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స

ప్రజాశక్తి- అరకులోయ : వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర ప్రారంభానికి రాష్ట్రపతి, గవర్నర్లను వినియోగించుకోవడం మోడీ ప్రభుత్వానికి తగదని సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి. అప్పలనర్స, అనంతగిరి జెడ్‌పిటిసి డి.గంగరాజు అభ్యంతరం వ్యక్తం చేశారు. మన్యంలో ఆదివాసీల సమస్యలు, వారికి సౌకర్యాల కల్పనపై కాకుండా, ఇలా వికసిత్ సంకల్ప్‌యాత్ర పేరుతో రాష్ట్ర గవర్నర్ ఏజెన్సీప్రాంతంలో పర్యటించడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తుందన్నారు

మంగళవారం అరకులో విలేకర్లుతో మాట్లాడుతూ, ఐదో షెడ్యూల్ ఏరియా క్లాజ్-1 ప్రకారం గవర్నర్‌కున్న విశేష అధికారాన్ని సుప్రీంకోర్టు ఛాలెంజ్ చేసి జిఒ3ను రద్దు చేసిందన్నారు. 5వ షెడ్యూల్ క్లాజ్ - 2 ప్రకారం రాష్ట్రపతి ఉత్తర్వులు ద్వారా స్థానిక ఆదివాసీలకు వంద శాతం రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పించడానికి అవకాశమున్నా గవర్నర్ ఆ దిశగా చర్యలు చేపట్టలేదన్నారు. గిరిజన సలహా మండలి తీర్మానం చేసినా జగన్,మోడీ ప్రభుత్వానికి రాష్ట్ర గవర్నర్‌గా సిఫార్సు చేయడం లేదా ఆదేశాలు జారీచేయడం వంటి చర్యలు నేటికి పూనుకోలేదన్నారు. జిఒ3ను రద్దుచేసి మూడేళ్లుగడిచినా, దాని పునరుద్ధరణకు చర్యలు చేపట్టకపోవడంతో ఆదివాసీ యువతీయువకులు తీవ్రమైన అన్యాయానికి గురవుతున్నారన్న విషయాన్ని గవర్నర్ విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు.

దీంతో ఇదే సమయంలో నోటిఫికేషన్ జారీచేసి, గురుకులాలు, ఏకలవ్య పాఠశాలల్లో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు గిరిజనేతరులతో భర్తీ చేశారని, ఐటిడిఎ ద్వారా 22 ఉద్యోగాలు కూడా గిరిజనేతరులతో భర్తీకి నోటిఫికేషన్ జారీచేశారన్నారు. 5వ షెడ్యూల్ స్ఫూర్తికి విరుద్ధంగా ఆదివాసీ జిల్లాలో ఆదివాసీలకు ఉద్యోగం ఇవ్వకుండా నోటిఫికేషన్ జారీచేస్తున్న గవర్నర్ ప్రేక్షపాత్ర వహించడం వల్ల ఏజెన్సీ ప్రాంతంలో తీవ్రమైన రాజ్యాంగ ఉల్లంఘన జరుగుతోందన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం రాష్ట్రపతి, గవర్నర్లు ఆదివాసీ ప్రాంతాలకు ప్రత్యేక ప్రతినిధులుగా విశిష్ట అధికారాలు కలిగివున్నారని, కేంద్ర ప్రభుత్వ ప్రతినిధిగా వున్న గవర్నర్ వ్యవస్థ ఆదివాసీ సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టు పేరుతో మన్యంలోని సహజ వనరులను అదానీ వంటి కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడానికి కేంద్ర ప్రభుత్వం అటవీసంరక్షణ చట్టాన్ని సవరించడం దుర్మార్గమన్నారు . ట్రైబల్ సబ్ ప్లాన్, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టాన్ని ప్రభుత్వాలు నిర్వీర్యం చేసినా గవర్నర్ తనకున్న విశేష అధికారంతో వాటిని నియంత్రించే చర్యలు చేపట్టలేదన్నారు. పోలవరం ప్రాజెక్టు పేరుతో సుమారు 3లక్షల మంది ఆదివాసీలు నిర్వాసితులవుతున్నా, వారి హక్కులు రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు దిశానిర్దేశం చేసి ఆదేశాలిచ్చే అధికారం, అవసరమున్న గవర్నర్, ఆయా విషయాల్లో పట్టించుకోలేదన్నారు. ఇపుడు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర పేరుతో ఐఎఎస్, ఐపిఎస్‌లను ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారకులుగా మార్చేప్రయత్నం కేంద్ర ప్రభుత్వం చేస్తుంటే, ఆ కార్యక్రమంలో పాల్గొనేందుకు గవర్నర్ హోదాలో రావడం ఆక్షేమణీయమన్నారు.ఈ ప్రచారం ద్వారా గిరిజనులను మభ్య పెట్టేందుకు మన్యం పార్వతీపురం, అల్లూరి సీతారామరాజు జిల్లాలను కేంద్రం ఎంచుకుందని, రాబోయే ఎన్నికల్లో ఓట్లు గుంజుకునేందుకే అధికారుల బాధ్యతలను దుర్వినియోగం చేయడాన్ని సిపిఎం ఆక్షేపిస్తుందన్నారు.

మోడీ పాలనలో దేశమంతా విలాప భారత్‌గా మారుతోందని, కరువు కాటకాలు, ఆత్మహత్యలు, అధిక ధరలు, మహిళలు, దళితులు ఆదివాసీలపై అత్యాచారాలపై భరతమాత విలపిస్తోందన్నారు. ఆదివాసీ మహిళ అయినా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్మును నూతన పార్లమెంట్ భవనం ప్రారంభానికి కనీసం ఆహ్వానం పంపకుండా అవమానపరిచినందుకు విమర్శలకు గురైన మోడీ ప్రభుత్వం, ఆదివాసీలను మభ్యపెట్టడానికి వికసిత్ భారత్ సంకల్ప యాత్ర చేపడుతోందన్నారు. ఆదివాసీ ప్రాంతంలో రాజకీయ ప్రయోజనాల కోసం బిజెపి ప్రభుత్వం చేస్తున్న కుట్రను, కేంద్ర ప్రభుత్వ విద్రోహాన్ని, ఆదివాసీలకు చేసిన అన్యాయాన్ని ఎక్కడికక్కడ నిలదీసి ప్రశ్నించాలని సిపిఎం విజ్ఞప్తి చేస్తోందన్నారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టవద్దనిఅధికారులను కోరారు. బిజెపి విద్వేష రాజకీయ ప్రయోజనాల కోసం అధికార యంత్రాంగాన్ని దుర్వినియోగం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతించకూడదని డిమాండ్ చేశారు.సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి రామారావు, డుంబ్రిగుడ మండల కార్యదర్శి పోతురాజు పాల్గొన్నారు.



నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఎంసి ప్రతినిధులు

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి రంపచోడవరం

స్థానిక భవిత కేంద్రంలో చెవిటి మూగ పాఠశాలలోని విద్యార్థులకు బాలల దినోత్సవం సందర్భంగా ఏఎంసీ డైరెక్టర్ దూడ స్మిత్ ఆధ్వర్యాన మంగళవారం పలకలు, నోట్ బుక్స్, పెన్నులు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో చిన్నం బాల శరత్ చంద్, గొర్రె కర్నేంద్ర ప్రసాద్, చవలం సంతోష్, మంజు భార్గవి, పావని, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి -సీలేరు

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అందజేస్తున్న ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలని జీకే వీధి ఎంపీపీ బోయిన కుమారి వాలంటీర్లు, గృహ సారథులకు పిలుపునిచ్చారు. జీకే వీధి మండలం దారకొండ సచివాలయంలో పల్లెకు పోదామని కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ కుమారి మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు పాదయాత్రలో చేసిన వాగ్దానాలను తూచా తప్పక అమలుపరిచారన్నారు. అనంతరం పల్లెకి పోదాం బ్రోచరు ఎంపీపీ కుమారి, వైసిపి మండల అధ్యక్షులు బొబ్బిలి లక్ష్మణ్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాడి రామన్న, సర్పంచ్ ఎన్. రాజు, వైస్ ఎంపీపీ ఎస్.ఆనంద్, ప్రాథమిక పరపతి సంఘం చైర్మన్ ప్రసాదు, ఏ.అంజి, శ్రీనివాస్, పిల్ల బుజ్జి, ఇఒపిఆర్‌డి పాపారావు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

రగ్గుల పంపిణీ

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని కొండగోకరి గ్రామంలో సామాజిక సేవకుడు మురళీకృష్ణ తన తండ్రి ప్రథమ వర్ధంతి సందర్భంగా స్థానికులకు మంగళవారం రగ్గులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముసిలి నాయుడు, లోకుల కిరణ్, గౌరీ నాయుడు, అప్పలరాజు, వెలగ జగన్నాధం, కినపర్తి సర్పంచ్ రిమాల శ్రీను, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రగ్గుల పంపిణీ చేస్తున్న మురళీకృష్ణ తదితరులు

చట్టాలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-అడ్డతీగల



మాట్లాడుతున్న న్యాయమూర్తి ప్రవీర్

స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలురు ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం సందర్భంగా మంగళవారం చట్టాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అడ్డతీగల జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ప్రవీర్ ముఖ్య అతిథిగా హాజరై న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడారు. విద్యార్థులు పిల్లలకు సంబంధించిన చట్టాలపై అవగాహన పెంపొందించుకొని సన్మార్గంలో నడవాలని సూచించారు. సహ విద్యార్థుల పట్ల స్నేహభావంతో మెలిగి ఆరోగ్యకరమైన వాతావరణాన్ని రూపొందించుకోవాలని కోరారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు చేసిన వంటలను పరిశీలించారు. మరుగుదొడ్ల నిర్వహణను చూసి, మెరుగైన వాతావరణానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. స్నానపు గదులు నిర్మాణానికి ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చామని, అక్కడ ఉపాధ్యాయులు తెలపడంతో ఇప్పుడు ఏ స్థితిలో ఉన్నదో తెలియజేయాలని కోరారు. తదుపరి ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు డి శ్రీధర్, ఈ.గౌరీ శంకర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం

ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి-అడ్డతీగల

అడ్డతీగల మండలం మల్లవరమవిళ్లు గ్రామ శివారు ప్రాంతంలో సుద్ద గండి వద్ద రెండు మోటార్ బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో రాయిపల్లి పంచాయతీ వెదుళ్ళ కొండ గ్రామానికి చెందిన మడకం బాబురావు (28) అక్కడికక్కడే మృతి చెందాడు. అదే బైక్‌పై ఉన్న ఆరు సంవత్సరాల కుమారుడికి, తల్లికి, మరో బైక్‌పై వస్తున్న అడ్డతీగల పంచాయతీ అనీగేరు గ్రామానికి చెందిన పిట్ట మంగిరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. ముగ్గురిని 108 వాహనంలో అడ్డతీగల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, డాక్టర్ సతీష్ ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ హాస్పటల్‌కు రిఫర్ చేశారు. సంఘటన స్థలంలో ఉన్న మృతదేహాన్ని అడ్డతీగల గ్రామంలో గల మహాప్రస్థానం వాహనంలో అడ్డతీగల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చి పోస్టుమార్టం అనంతం బంధువులకు అప్పగించినట్లు ఎస్ఐ అప్పలరాజు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

ప్రజలకు భరోసా ఇవ్వాలి

ప్రజాశక్తి-రంపచోడవరం

క్షేత్రస్థాయిలో బూత్ ఇన్‌ఛార్జులు, సాధికార సారథులు కీలక పాత్ర పోషిస్తూ ప్రజలకు మేమున్నామని భరోసా అందించాలని టిడిపి మండల అధ్యక్షులు కారం సురేష్‌బాబు పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి ఆదేశాల మేరకు మండలంలోని ఆకూరు, వేములకొండ పంచాయతీల పరిధిలో సురేష్ బాబు ఆధ్వర్యంలో ఆకూరు, వేములకొండ, చిలక మామిడి బూత్ పరిశీలకులు లంక హరిబాబు సమక్షంలో బూత్ ఇన్‌ఛార్జులు, సాధికార సారథులతో ముఖాముఖి సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు విడుదల చేసిన మేనిఫెస్టో బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం ద్వారా ఇంటింటికి వెళ్లి ఇవ్వనున్న పథకాలు పూర్తిస్థాయిల వివరించి హక్కు పత్రం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కారం సింహాచలం, పాకరాజు, అబ్బులు, నేరం వీరస్వామి, అబ్బాయి రెడ్డి, ఉగ్గిరాల భాస్కర్, వీరస్వామి, రాజు, కృష్ణ, పండు రెడ్డి పాల్గొన్నారు.

మన్యంలో పెరిగిన చలి తీవ్రత

ప్రజాశక్తి -కొయ్యూరు

కొయ్యూరు ఏజెన్సీలో చలి తీవ్రత పెరిగింది. రాత్రి నుంచి దట్టంగా మంచు కురుస్తోంది. తెల్లవారుజామున చలి తీవ్రంగా ఉండటంతో మన్యంలో నివసిస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. చలి నుండి ఉపశమనం పొందడానికి చలి మంటలు వేసుకుంటూ కొంతవరకూ శరీరాన్ని వేడి చేసుకుంటున్నారు. చలితీవ్రత ఎక్కువ కావడంతో ప్రజలు స్వెట్టర్లు, మంకీ టోపీలు, శాలువాలు, ఉన్నిదస్తులు ధరించి తమ దినసరి పనులు చేసుకుంటున్నారు. వృద్ధులైతే చలికి తట్టుకోలేక ఇళ్లకే పరిమితమవుతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే రానున్న రోజుల్లో చలి తీవ్రత ఇంకా భారీగా పెరిగే అవకాశం ఉందని మండల వాసులు అంటున్నారు.

చిట్టెంపాడులో 'భవిష్యత్తు గ్యారెంటీ'

ప్రజాశక్తి-కొయ్యూరు

మండలంలోని చిట్టెంపాడులో పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆధ్వర్యంలో బాబు షూరిటీ, భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ టీడీపీ మినీ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. వైసీపీ పాలనలో గిరిజన ప్రాంతంలో అభివృద్ధి మరింత కుంటుపడిందని ఆరోపించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. కార్యక్రమంలో కొయ్యూరు మండల టిడిపి నేతలు పాల్గొన్నారు.

తాగునీటి బోర్ల నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-కొయ్యూరు : కొయ్యూరు మండలం లంకెలవీధి, సీకాయపాలెం గ్రామాల్లో అరకు ఎంపీ గొడ్డేటి మాధవి నియోజకవర్గ అభివృద్ధి నిధులతో మంజూరైన తాగునీటి బోర్ల నిర్మాణ పనులను వైయస్సార్‌సిపీ గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొడ్డేటి మహేష్ మంగళవారం ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎంపీ దృష్టికి తీసుకెళ్లిన వెంటనే బోర్లు మంజూరు చేశారని మహేష్ తెలిపారు. ఈ మేరకు ఎంపీ మాధవికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న జికె.వీధి సిఐ అశోక్‌కుమార్

అక్రమంగా మద్యం అమ్ముతున్న ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి -సీలేరు

అక్రమంగా మద్యం అమ్ముతున్న ముగ్గురు వ్యక్తులను అదుపులో తీసుకొని, వారిని రిమాండ్‌కు తరలించినట్లు జీకే వీధి సిఐ అశోక్‌కుమార్ తెలిపారు. పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. సిఐ కథనం ప్రకారం... జీకే వీధి మండలం సంకాడ పంచాయతీ నిమ్మలపాలెం గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్నారని ముందు సమాచారంతో జికె.వీధి ఎస్సై అప్పలసూరి, సిబ్బంది దాడులు నిర్వహించి 38 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మద్యం బాటిళ్ల విక్రయాలు చట్టరీత్యా నేరమని, అటువంటి కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడితే పీడీ యాక్ట్ కేసు నమోదు చేసి ఆస్తులు జప్తు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అప్పలసూరి పాల్గొన్నారు.

డిసెంబర్‌లో యువతకు నైపుణ్య శిక్షణ

ప్రజాశక్తి -సీలేరు

నిరుద్యోగ యువత నైపుణ్య శిక్షణలో చేరి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని జీకే వీధి సిఐ అశోక్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీసులు, సిఆర్పిఎఫ్ సివిక్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వబడుతుందని పేర్కొన్నారు. విశాఖపట్నంలోని స్కిల్ డెవలప్మెంట్ ఇనిస్టిట్యూట్‌లో అల్లూరి సీతారామరాజు జిల్లా నిరుద్యోగ గిరిజన యువతకు ఈ శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ద్విచక్ర వాహనం సర్వీస్ టెక్నీషియన్ 70 రోజుల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. దీనికి పదో తరగతి తప్పనిసరిగా పాస్ అయి ఉండాలన్నారు. ఆఫీస్ అసిస్టెంట్ శిక్షణ 40 రోజులు ఇస్తున్నారని, దీనికి ఇంటర్ పాసైన యువత అర్హులని పేర్కొన్నారు. డిసెంబరు మొదటి వారం నుంచి దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు బ్యాచి ట్రైనింగ్‌లో చేరడానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని సీఐ అశోక్ కుమార్ తెలిపారు. ఆసక్తిగల యువతి యువకులు స్థానిక పోలీస్ స్టేషన్లోగాని, లేక మహిళా పోలీస్‌ను గాని సంప్రదించాలని ఆయన సూచించారు.

చంటిబాబు కుటుంబానికి ఎంపిపి పరామర్శ

ప్రజాశకి- కొయ్యూరు

మండలం రత్నంపేట గ్రామంలో ఇటీవల అకాల మరణం చెందిన లింగేటి చంటిబాబు కుటుంబాన్ని ఎంపిపి బడుగు రమేష్ మంగళవారం పరామర్శించారు. కుటుంబానికి పెద్దదిక్కు కోల్పోయిన ఆ కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఏ సమస్య ఉన్న తమకు తెలియజేస్తే పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఇతర సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పాటి శేఖర్, మాజీ సర్పంచ్, గంగరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు

నిర్వాసితులను చేసే క్వారీలను నిలిపేయాలి

మావోయిస్ట్ విశాఖ అల్లూరి అనకాపల్లి విఎఐ డివిజన్ కమిటీ కార్యదర్శి అరుణ

ప్రజాశక్తి -జి.మాడుగుల: ప్రజలను నిర్వాసితులను చేస్తున్న నల్లరాయి, గ్రానైట్ క్వారీలను తక్షణమే నిలిపేయాలని నిషేధిత సిపిఐ(ఎంఎల్) మావోయిస్ట్ విశాఖ అల్లూరి అనకాపల్లి విఎఐ డివిజన్ కమిటీ కార్యదర్శి అరుణ పేరిట లేఖను పత్రికలకు విడుదల చేశారు. జి.మాడుగుల . మండలంలోని ఉరుము, మదురమామిడి పరిసర ప్రాంతంలో హైవే నిర్మాణంలో భాగంగా వ్యవసాయ భూముల్లో ప్రజల అనుమతి లేకుండానే అక్రమంగా నల్లరాయి క్వారీలను ఏర్పాటు చేస్తున్నారని, ఇప్పటికే స్థానిక ప్రజలు హైవే నిర్మాణం కోసం, రోడ్డు నిర్మాణ కూలీలు వుండేందుకు షెడ్ల నిర్మాణం కోసం తమ పంట భూములను కోల్పోయారని పేర్కొన్నారు. నష్టపోయిన భూములకు ప్రభుత్వం ఇస్తానన్న పరిహారం ఇప్పటికీ ఇవ్వలేదని, . తిరిగి ఇప్పుడు నల్లరాయి క్వారీలను ఏర్పాటుకు కాంట్రాక్టర్లతో అధికార పార్టీ మంత్రులు ఒప్పందాలు కుదుర్చుకున్నారన్నారు.. దీనివలన ప్రజలు వ్యవసాయ భూములను, తాగునీటిని, నివాస స్థలాలను కోల్పోవడమే కాకుండా శబ్ద, పర్యావరణ కాలుష్యంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని పేర్కొన్నారు. మన్యంలో 97 జిఒ ను రద్దు చేసి బాక్సైట్ తవ్వకాలను నిలిపివేస్తానని హామీనిచ్చిఅధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం, గడచిన నాలుగున్నరేళ్ల పాలనలో బూటకపు సంస్కరణలు, పథకాలతో ప్రజలను మభ్యపెట్టిందని పేర్కొన్నారు. కేంద్రంలోని బిజెపితో అంటకాగుతూ,ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేస్తూ సామ్రాజ్యవాదుల, బడా కార్పొరేట్ సంస్థల స్వార్థ ప్రయోజనాలరే రాష్ట్రాన్ని, ప్రజల సంపదను ఎలా అమ్మివేస్తున్నదో కళ్ల ముందు నగ్నంగా కనిపిస్తోందన్నారు. నేడు ఎన్నికలు దగ్గర పడుతున్నకొద్దీ ఎంత దొరికితే అంత కాజేయాలన్నట్టు అధికార పార్టీ ఎమ్మెల్యేలు భూదందాలు, కాంట్రాక్టర్లు, మైనింగ్ మాఫియాలు ప్రజల సంపదను దోచుకు తింటున్నారని పేర్కొన్నారు.. ఆదివాసులకు, పీడిత ప్రజలకే అడవిపై హక్కు అనే నినాదంతో మిలిటెంట్ పోరాటం చేయాలని, మైనింగ్ మాఫియాను తన్ని తరిమేయాలని, హామీలపై అధికారపార్టీ నాయకులను నిలదీయడంలో అల్లూరి వారసత్వాన్ని కొనసాగించాలని లేఖలో పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఎరగా వేస్తున్న ప్యాకేజీలకు, డబ్బులకు లొంగిపోకుండా, చీలిపోకుండా ఆదివాసీ ప్రజలంతా ఐక్యంగా, దఢంగా ఉద్యమించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ప్రతిపక్ష, వామపక్ష బూర్జువా పార్టీలు, ఆదివాసీ సంఘాలు నిజంగా ఆదివాసీ ప్రజల మనుగడను కోరుకున్న వారైతే నిజాయితీగా, నిస్వార్థంగా వారి పక్షాన నిలబడాలనీ, ఉద్యమంలో క్రియాశీల భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

ఎపిటిఎఫ్ మండల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి -హుకుంపేట: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎపిటిఎఫ్ అల్లూరి జిల్లా నాయకులు బట్టి చిన్నారావు, ఎల్‌వి.దొరగారు ఎన్నికల పరిశీకులుగా, హుకుంపేట మండల నూతన కమిటీ ఎన్నికలు మంగళవారం నిర్వహించారు. ఎపిటిఎఫ్. మండలకమిటీ నూతన అధ్యక్షుడిగా మొస్య సత్యారావు, ప్రధాన కార్యదర్శిగా గడ్డంగి కన్నారావులను ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షునిగా కె.మోదకొండ, ఉపాధ్యక్షులుగా కడిలి వెంకటేశ్వరరావు, సోసోత భాస్కరరావు, విజ్ఞేశ్వరరావు, మహిళా అధ్యక్షురాలుగా పార్వతమ్మ, కార్యదర్శులుగా ఎల్.ఉమామహేశ్వరరావు, టి.తౌడం నాయుడు, ఎస్. అనిల్‌కుమార్ మహిళా కార్యదర్శి ఎస్.విజయలను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా నూతన కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సత్యారావు,కన్నారావు మాట్లాడుతూ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామన్నారు.

16న బిఎస్ఎన్ఎల్ సేవలపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి -పాడేరు : స్థానిక బిఎస్ఎన్ఎల్ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ కార్యాలయం ఆవరణలో ఈనెల 16న శుక్రవారం ఉదయం 11 గంటలకు వినియోగదారుల అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ పాల్ విలియం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో బిఎస్ఎన్ఎల్ అందిస్తున్న సేవలపై అవగాహన, వినియోగదారుల సలహాలను ఈ సదస్సులో నివృత్తి చేస్తామన్నారు. వినియోగదారులు సదస్సులో పాల్గొనాలని కోరారు.

చింతపల్లిలో పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి-చింతపల్లి: మండల కేంద్రంలోని సాయినగర్ వీధిలో మంగళవారం పూరిల్లు దగ్ధమైంది. అందిన సమాచారం మేరకు సాయినగర్ వీధిలోని పాటి పప్పీ సైపాన్ అనే వ్యక్తికి చెందిన ఇల్లు ప్రమాదవశాత్తు అగ్నికి ఆహుతి అయ్యింది. మంటలు చెలరేగడానికి కారణాలు తెలియక పోయినప్పటికీ, ఆకతాయిలు కాల్చిన బాణసంచా నిప్పురవ్వలు పడడం వల్లే ప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ మంటలు ఆర్పేందుకు పాడేరు నుండి అగ్నిమాపక వాహనానికి సమాచారం అందించారు. పాడేరు నుంచి చింతపల్లి చేరుకునే లోపే పూరిల్లు దగ్ధమై, మొండి గోడలు మిగిలాయి.

ప్రజారక్షణ భేరికి తరలిన సిపిఎం శ్రేణులు



విజయవాడకు బయలుదేరి అరకు రైల్వే స్టేషన్ లో ఉన్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి -అరకులోయ : అసమానతలు లేని సమాజ నిర్మాణ కోసం సిపిఎం నిరంతరం పోరాటం చేస్తుందని ఆ పార్టీ నేతలు స్పష్టం చేశారు. ఈనెల 15న విజయవాడలో జరగనున్న ప్రజా రక్షణ భేరి యాత్ర బహిరంగసభకు అరకు సిపిఎం నేతలు మంగళవారం బయలుదేరి వెళ్లారు. అరుకు రైల్వే స్టేషన్‌లో పలు నినాదాలు చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,దేశానికి రాష్ట్రానికి ద్రోహం చేస్తున్న బిజెపి నరేంద్ర మోడీకి తోడ్పడుతున్న ఆంధ్రరాష్ట్రంలో వైసిపి, టిడిపి, జనసేన పార్టీల వైఖరిలను వ్యతిరేకించాలని, పేద బడుగు బలహీన వర్గాల హక్కులను కాపాడాలని, నిరుద్యోగం రూపుమాపాలని, విద, వైద్యం ఉచితంగా ఇవ్వాలని, దేశ సంపదపై ప్రతి ఒక్కరికి హక్కు ఉండాలని, రైతులకు గిట్టుబాటు ధర భూమిలేని పేదవాడికి ప్రతి ఒక్కరికి రెండు ఎకరాల భూమి ఇవ్వాలని, మైనారిటీల హక్కులు పరిరక్షణ రిజర్వేషన్లు, మతసామరస్యం వంటి సమస్యలు పరిష్కారం చేయాలని, భారత రాజ్యాంగాన్ని కాపాడాలని, ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటీకరణ చేయరాదన్న డిమాండ్లతో సిపిఎం చేపట్టిన ప్రజారక్షణ భేరి బస్‌యాత్రకు ముగింపుగా ఈ బహిరంగసభ జరుగుతుందన్నారు.

ప్రజా రక్షణ భేరికి బయలుదేరిన వారిలో సిపిఎం నాయకులు కార్యకర్తలు మండల కార్యదర్శి కిండంగి రామారావు, మగ్గన్న, నానిబాబు, గురుమూర్తి,నాగేంద్ర, జగనాదం,మొద్దు, రత్నకుమారి, సురేష్, సత్యానారయణ,అచ్చమ్మ, మోహన్ దాస్,త్రినాధ్, రామ్ దాస్,నర్స, సింహాద్రి,రాము, సుబ్బారావు, నాగేశ్వరరావు, సాయికుమార్, కేశవరావు, వెంకట్రావు, జగన్నాథం ఉన్నారు.

ప్రత్యేక బస్సులో ప్రజారక్షణ భేరి సభకు...

అనంతగిరి : విజయవాడలో జరిగే ప్రజారక్షణ భేరి బహిరంగ సభకు అనంతగిరి, అరకు, డుంరిగూడ, మండలాలకు చెందిన సిపిఎం నేతలు కార్యకర్తలు ప్రత్యేక బస్సులో బయలుదేరి వెళ్లారు. అనంతగిరిలో ఈ బస్సును స్థానిక జెడ్‌పిటిసి, సిపిఎం నేత దీసరి. గంగరాజు ఎర్ర జెండా ఊపి ప్రారంభించారు సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విజయవాడలో జరుగు బహిరంగ సభకు బయలుదేరి వెళ్లిన వారిలో స్థానిక జడ్పిటిసి గంగరాజుతో పాటు టోకూరు సిపిఎం సర్పంచ్ కిల్లో మొస్య, వేంగడ మాజీ సర్పంచ్ సివేరి కొండలరావు, పార్టీ మండల కార్యదర్శి ఎస్, నాగులు, మహిళా సంఘం మండల ప్రతినిధులు కాసులమ్మ, దేముడమ్మ, శ్రావణి, పార్టీ కార్యకర్తలు ఉన్నారు.



ప్రత్యేక బస్సులో విజయవాడకు తరలి వెళ్తున్న అనంతగిరి సిపిఎం నేతలు

ఆర్‌టిసి బస్సుకు తప్పిన పెను ప్రమాదం

రోడ్డు అంచున మట్టిలో కూరుకుపోయిన బస్సు

60 మంది ప్రయాణికులు సురక్షితం

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని కొట్నాపల్లి సమీపంలో పాడేరు డిపోకు చెందిన ఉప్ప ఆర్‌టిసి బస్సు రోడ్డు అంచున మట్టిలో కూరుకుపోయి ఒరిగిపోయింది. ఉదయం తొమ్మిది గంటల సమయంలో ఉప్ప నుంచి పాడేరు వస్తున్న సమయంలో ఎదురుగా లారీ, ఆటో వస్తున్న క్రమంలోనే వాటిని తప్పించబోయి, ఎడమవైపున రోడ్డు అంచున ఉన్న లూజ్ మట్టిలో ముందు, వెనుక వైపున్న చక్రాలు దిగిపోవడంతో కల్వర్టు పక్కన ఎడమవైపు ఒక్కసారిగా వాలిపోయింది. దీంతో బస్సులోని దాదాపు 60మంది ప్రయాణికులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో బస్సు బోల్తా పడకుండా నిలిచిపోవడంతోపాటు ఎదురుగా ఉన్న విద్యుత్‌స్తంభాన్ని ఢీకొట్టకుండా ఆగిపోయింది. దీంతో ప్రయాణికులందరూ ఊపిరిపీల్చుకుని, ఒక్కరొక్కరుగా మెల్లగా బస్సు నుంచి దిగి హమ్మయ్య అనుకున్నారు. ఎటువంటి ప్రాణహాని జరగకపోడంతో ప్రయాణికులు ఊపిరి పిలుసుకున్నారు. బస్సులో చిన్న పిల్లలు, వృద్ధులతో సహా 60 మంది ప్రయాణికులున్నారు.

హెచ్చరిక చర్యలు, జాగ్రత్తల్లో నిర్లక్ష్యం

బస్సు ప్రమాద సమాచారం తెలుసుకున్న స్థాని జెడ్‌పిటిసి రేగం మత్స్యలింగం, ఎంపిటిసి సాంబ బాలకృష్ణ వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని, సహాయకచర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జాతీయ రహదారి నిర్మాణం జరుగుతున్న సమయంలో అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు, రోడ్డు అంచులను గుర్తిస్తూ సరిహద్దు రెడ్ రిబ్బన్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా, వాటిని పెట్టడంలో సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ వైఫల్యం, నిర్లక్ష్యం వల్లే ప్రస్తుతం ప్రమాదం చోటుచేసుకుంది. ప్రాణాపాయ ప్రమాదం నుంచి త్రుటిలో తప్పిందే సరేసరి, లేకుంటే పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. గ్రామ సమీపంలో పనులను చేస్తున్నప్పుడు దుమ్ము,ధూళిరేగకుండా రోజుకు రెండుసార్లు వాటరింగ్ చేయడంతోపాటు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం శీతాకాలం కావడంతో పొగమంచు కమ్మేసి, రోడ్డు కనబడని పరిస్థితులు ఉత్పన్నమయ్యే స్థితి ఉన్నందు తగు జాగ్రత్తలు తీసుకుని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఘనంగా బాలల దినోత్సవం



చింతపల్లిలో నెహ్రూ చిత్రపటం వద్ద నివాళి...

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: మండల కేంద్రంలోని శారదనికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల వద్ద బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. దేశ మొదటి ప్రధాని చాచానెహ్రూ చిత్రపటానికి ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా నెహ్రూ చేసిన సేవలను కొనియాడారు. పిల్లలంటే అమితంగా ప్రేమించే నెహ్రూ జయంతిని బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు వివరించారు.

మండలం కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల బాలురు 1,2 బాలికలు ఆశ్రమ పాఠశాల 1,2లలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య ప్రతినిధులు చెంద మత్స్య రాజు, దొన్ను, ఉపాధ్యాయులు, చిన్నారులు పాల్గొన్నారు.

హుకుంపేట: మండలంలోని ములియపుట్టు పంచాయతీ భీరం గ్రామచావడి వద్ద కాంగ్రెస్ ఆధ్వర్యాన నెహ్రూ జయంతి, బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. గ్రామ పెద్దలతో కలిసి నెహ్రూ చిత్రపటానికి కాంగ్రెస్ సీనియర్ నాయకులు బాలకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిన్నారులకు మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ కూడా బాలకృష్ణ, కార్యకర్తలు సీసా రామారావు,బాబురావు, పోతురాజు, కళావతి, వి.కృష్ణ, గ్రామ పెద్దలు సోమన్న, వైకుంఠరావు గ్రామస్తులు పాల్గొన్నారు.

పెదబయలు :స్థానిక బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని చాచానెహ్రూ చిత్రపటానికి ప్రిన్సిపాల్ డి శంకరరావు జ్యోతిప్రజ్వళన చేసి, పూలమాలలు వేసినివాళులర్పించారు. పండిట్ నెహ్రూ దేశానికి చేసిన సేవలు కొనియాడారు, ఉపాధ్యాయులు, విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు

చింతపల్లి: అంతర్ల అంగనవాడి కేంద్రంలో అంగన్వాడీ కార్యకర్త పుట్టపల్లి నాగరత్నం ఆధ్వర్యంలో -తీయ బాలల దినోత్సవం నిర్వహించారు. సిడిపిఒ డి వెంకట రమణితోపాటు అంగనవాడి సూపర్వైజర్లు ఎస్ గౌరీ, కే విజయకుమారి, సిహెచ్ సత్యవతి, పి అప్పల నరసమ్మ, ఎస్.కె గౌహారి నిషా, చింతపల్లి- 3 సచివాలయం హెల్త్ కార్యదర్శి (ఎఎన్ఎం) కోపూరు విజయలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ కుమ్మరి లక్ష్మణరావు, ఆశ కార్యకర్తలు తూబేరి నూకరత్నం, గెమ్మేలి బాలమ్మ, అంగన్వాడి ఆయా రామతల్లి, చిన్నారులు పాల్గొన్నారు.

సీలేరు :జికె.వీధి మండలం సీలేరు డిఎవి పాఠశాలలో బాలల దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటేషన్ అందర్నీ ఎంతగానో అలరించింది. ఈ కార్యక్రమంలో ఎల్ఎంసి చైర్మన్, ఏపీ జెన్కో ఎస్ఇ కెకెవి.ప్రశాంత్ కుమార్, ఈఈలు లక్ష్మీనారాయణ, ప్రభాకర్, ప్రధానోపాధ్యాయులు నమశ్శివాయ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విఆర్.పురం : స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం బాబూరావు మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను అభ్యశించి ఉన్నత శిఖరాలను అందుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సున్నం చంద్రావు, రాము, శిరమయ్య, పి వరలక్ష్మి, సీత, వెంకటలక్ష్మి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కొయ్యూరు : మండల కేంద్రంలోని ఆశ్రమం పాఠశాలలతో పాటు జెడ్‌పి హైస్కూల్, ఏపీఆర్ స్కూల్, ఏకలవ్య మోడల్ పాఠశాల తదితర పాఠశాలల్లో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ చిత్ర పటాలకు పాఠశాల ప్రిన్సిపాల్ జగన్నాథరావు, ఉపాధ్యాయులు శ్రీలక్ష్మి, శంకరరావు, సత్యనారాయణ, తమ్మారావు, గోవింద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వివిధ ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన బాల బాలికలకు బహుమతులు అందజేశారు. పాఠశాల విద్యార్థులు నృత్యాలు, పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు.

మారేడుమిల్లి : మండలంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో బాలల దినోత్సవం వేడుకలు నిర్వహించారు. మారేడుమిల్లి ప్రిన్సిపాల్ అరుణ కుమారి, రంపచోడవరం ప్రిన్సిపాల్ ఐ.విటల్ ఆధ్వర్యంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేక్ కటింగ్ చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. మండలంలో అన్ని పాఠశాలల్లో ఘనంగా నెహ్రూ జయంతి వేడుకలు నిర్వహించారు. ఎపి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సత్యవేణి, ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలురు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం రామారావు, గిరిజన సంక్షేమ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిఎస్ కుమార్, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల స్పెషల్ ఆఫీసర్ మయూరి లక్ష్మి ఆధ్వర్యంలో నెహ్రూకు ఘనంగా నివాళులర్పించారు.



నినాదాలు చేస్తున్న విద్యార్థినులు

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో..

అధ్యాపకులను నియమించాలని నిరసన

ప్రజాశక్తి- అరకు లోయ : స్థానిక ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులను నియమించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులు నిరసన చేపట్టారు..ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి ఎస్. ఐసుబాబు, గర్ల్స్ కన్వీనర్ కె.ధనలక్ష్మి, ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు కె. శాంతి మాట్లాడుతూ, గిరిజన విద్యార్థినులకు నాణ్యమైన విద్య అందించకుండా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. డిగ్రీ కళాశాలలో లెక్చరర్స్ లేకుండా 2019 నుంచి ఇప్పటివరకు కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. అధ్యాపకుల కొరతతో గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందని పరిస్థితిఉందని, ఇలాగైతే పోటీ ప్రపంచంలో ఎలా మనుగడ సాధిస్తారని ప్రశ్నించారు. కళాశాల ప్రారంభం నుండి ఒక్క ప్రిన్సిపల్‌తోనే నేటివరకు కాలం వెల్లదీస్తూ వస్తున్నారని, గిరిజన విద్య పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇది నిదర్శనమన్నారు..600 మంది విద్యార్థినుల భవిష్యత్‌తో చెలగాటమాడుతున్న ప్రభుత్వం, నేతలు, అధికారులు ఇప్పటికైనా కళ్లు తెరవాలని, అరకు డిగ్రీ కాలేజీని అధ్యాపకులతోపాటు అవసరమైన సిబ్బందిని నియమించాలని, పూర్తిస్థాయి సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. అధ్యాపకులను నియమించడానికి కృషి చేస్తామని ఎస్‌టి కమిషన్ చైర్మన్, అరకుఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ హామీ ఇచ్చినా నేటికీ కార్యరూపం దాల్చలేదన్నారు. ఇప్పటికైనా తగు చర్యలు చేపట్టకుంటే ఆందోళనతీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు కె. కొండమ్మ, మండల కమిటీ సభ్యులు జమున,శైలజ, విద్యార్థినిలు భారతి, సుబ్బలక్ష్మి, త్రిష, రోహిణి పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి -హుకుంపేట: స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియరన్ వి.మానస ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ నెల 14 తేదీ నుండి 20వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రంథాలయ సేవలను ప్రజలు, పాఠకులకు వివరించి, వాటిని వినియోగించుకునేలా వారోత్సవాల్లో అవగాహన కల్పిస్తామన్నారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులను అందజేస్తామన్నారు. స్థానిక సర్పంచ్ వెంకట పూర్ణిమ పాల్గొని విద్యార్థులకు బహుమతులు మిఠాయిలు పంచిపెట్టారు.

డుంబ్రిగుడ : స్థానిక శాఖ గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను గ్రంథాలయ అధికారిని ఎస్ సునీత ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభించారు. వారోత్సవాల జెండాను సర్పంచ్ వి వెంకట్రరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు టి సుబ్బారావు మాజీ జెడ్పిటిసి ఎం శ్రీరాములు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

రంపచోడవరం : జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో 56వ గ్రంథాలయ వారోత్సవాల్లో మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సర్పంచ్ మంగా బోజ్జయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ పుస్తక జ్ఞానాన్ని అలవర్చుకోవాలన్నారు. గ్రంథాలయాల్లో మంచి పుస్తకాలు చదవడం వల్ల ఎంతో విషయపరిజ్ఞానం వస్తుందని చెప్పారు.

ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొమ్మిశెట్టి బాలకృష్ణ, ఎంపీటీసీ ఉలవల లక్ష్మి, వైయస్సార్‌సిపి మండల కన్వీనర్ జల్లేపల్లి రామన్నదొర, జెసిఎస్ మండల కన్వీనర్ పండా రామకృష్ణదొర, సచివాలయ కన్వీనర్ తుపాటి రాజారావు, గ్రంథాలయ సెక్రటరీ పండా లక్ష్మి పాల్గొన్నారు.

ఉట్టిపడిన సంస్కృతి, సంప్రదాయం!

మన్యంలో ఆచారబద్ధంగా మూడు రోజుల దీపావళి
పంచెకట్టుతో సందడి చేసిన గిరిజన చిన్నారులు



పంచె కట్టులో ఆకర్షణీయంగా కనిపిస్తున్న గిరిబాలలు

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు: మన్యవాసులు జరుపుకునే ప్రతి పండగకూ ఒక ప్రత్యేకత ఉంటుంది. గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు, కట్టుబొట్టు, ఆచార వ్యవహారాలు అన్నింటికీ ప్రత్యేక ప్రాధాన్యనిస్తూ పండుగలను జరుపుకుంటుంటారు. ప్రస్తుతం మారుమూల గిరిజన ప్రాంతంలో జరుపుకునే మూడురోజుల దీపావళి పండుగ అలాంటి ప్రత్యేకతను సంతరించుకోవడం విశేషం. మండలంలోని సుజనకోటగిరిజన ప్రాంతంలో దీపావళి పండుగను మూడు రోజులపాటు ఆనవాయితీగా గ్రామస్తులంతా జరుపుకుంటారు. ఈ పండుగకు సుదూర ప్రాంతాల నుండి స్వగ్రామాలకు చేరుకుని కుటుంబ సమేతంగా జరుపుకోవడం విశేషం. మూడు రోజులపాటు జరిగే ఈ పండుగను పూర్వపు సంస్కృతి సాంప్రదాయాలకు అనుగుణంగా మూడో రోజు చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో కలిసి చంటి పిల్లలకు తలనీలాలు సమర్పించడం, గ్రామస్తులు, ఇరుగుపొరుగు గ్రామస్తులు తెచ్చిన నీళ్లను గ్రామంలో ఒక దగ్గర సమకూర్చి, వాటితో పిల్లలకు ప్రత్యేక స్నానాలు చేయించడం, గిరిజన సాంప్రదాయ నృత్యాలు చేస్తూ, టపాసులు పేలుస్తూ అంగరంగ వైభవంగా ఈ పండుగను జరుపుకున్నారు. మూడో రోజు గ్రామస్తులంతా కొండపైకి వెళ్లి పెద్ద పొడవాటి గడకర్ర తెచ్చి గ్రామం నడిబొడ్డున ప్రత్యేక పూజలతో నిలువ దీస్తారు. సాయంత్రం ప్రత్యేక పూజలు చేసి, శ్మశాన వాటికల వద్ద వెళ్లి వారి పితరులను జ్ఞాపకం చేసుకొని అర్చించడంతో పండగ ముగుస్తుంది. గ్రామస్తులంతా ఎంతో ఆనందంగా థింసా, ఇతర సాంప్రదాయ నృత్యాలతో ఈ పండగలో సందడి చేశారు. ఏటా దీపావళి తర్వాత శుక్లపక్ష విజయ తిథి అనురాధ నక్షత్రంలో పెద్దల సామూహిక స్నానాలు, పదేళ్లలోపు పిల్లలకు సాంప్రదాయ పంచకట్టు కట్టించడం ఆనవాయితీగా చేస్తున్నారు. మండలంలోనిమారుమూల సుజనకోట కాలనీ, దారెల, కిలగడ, మినుములపుట్టు, కించయిపుట్టు, చివుకుచింత గ్రామాలలో ఈ ఏడాది కూడా ఆనవాయితీగా మూడురోజుల దీపావళి పండుగను దేదీప్యమానంగా నిర్వహించారు. వెంగడ నీలకంఠం, అర్చకులు నాగేశ్వరరావు, గంజాయి నీలయ్య ,గంజాయి మధన్, వేంగడ జగన్ లతో పాటు పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

టిడిపితోనే మంచి భవిష్యత్తు

ప్రజాశక్తి- పెదబయలు : టిడిపి గెలుపుతోనే ప్రజలకు, రాష్ట్రానికి మంచి భవిష్యత్తు ఉంటుందని, నయవంచన వైసిపికి తగిన బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి కిడారి శ్రావణ్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలో అడుగులపుట్టు పంచాయతీ వడ్డేపుట్టు గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీకార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా స్థానిక మహిళలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. 75వ పోలింగ్ బూత్ పరిధిలో ఇంటింటికి వెళ్లి ప్రజాసమస్యలను తెలుసుకోవడంతోపాటు వైసిపి వైఫల్యాలను వివరించారు. టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేసే మేనిఫెస్టోలోని పథకాలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టిడిపిని గెలిపిస్తే ప్రజలకు మంచి భవిష్యత్ ఉంటుందని భరోసానిచ్చారు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్‌సిలెండర్లు, మహిళలకు ఉచిత ఆర్‌టిసి ప్రయాణం, తల్లికి వందనంలో చదువుకున్న పిల్లలందరికీ ఏటా రూ.15వేలు ఆర్థికభరోసా, 18ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1500 భృతి వంటి పథకాలను అందజేస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల కార్యదర్శి నాగేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌చార్జి ప్రసాద్, పరశురామ్ పాల్గొన్నారు.

నేటి నుంచి రాత్రి విమానాలు బంద్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

నేటి నుంచి విశాఖ ఎయిర్ పోర్టులో రాత్రి పూట విమానాల రాకపోకలను దాదాపు ఆరు నెలల పాటు నిలుపుదల చేయనున్నారు. ఎయిర్ పోర్టులో రన్ వే పునరుద్ధరణ పనుల కోసం కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టమవుతోంది. దేశంలో ఎక్కడా లేని విధంగా ఇన్ని నెలల పాటు ఒక విమానాశ్రయంలో రాకపోకలను రద్దు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హైదరాబాద్, పూణె, ఢిల్లీ తదితర చోట్ల గతంలో రన్ వే పనులు 15 నుంచి 20 రోజుల్లో పూర్తిచేసి విమాన రాకపోకలకు ఆటంకం లేకుండా చేశారు. కానీ విశాఖ ఎయిర్‌పోర్టుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం అత్యంత అసాధారణ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పలు రాజకీయ పార్టీలు, ఎయిర్ ట్రావలర్స్ సంస్థలు, విశాఖ ఎంపీ ఎంవివి.సత్యనారాయణ పలు మార్లు కేంద్ర ప్రభుత్వానికి నివేదించినా ఫలితం లేకపోయింది. తాజా నిర్ణయం మేరకు బుధవారం రాత్రి 9 గంటల నుంచి ఆరు నెలలపాటు ప్రతిరోజూ ఉదయం 8 గంటల వరకూ విమానాల రాకపోకలు ఉండవు. ఆ సమయాన్ని తగ్గించాలంటూ ఎయిర్ పోర్టు అధికారులు సైతం ఇండియన్ నేవీ అధికారులను కోరారు. రన్ వే పనుల కోసం రాత్రిపూట విమానాల రాకపోకలను నిలుపుదల చేయాల్సిందేనని తూర్పునౌకాదళం చీఫ్ తాజాగా వెల్లడించారు. తూర్పు నౌకాదళం ప్రధాన కేంద్రంగా విశాఖపట్నం, ఈ ఎయిర్‌పోర్టుకు ఆనుకునే ఇండియన్ నేవల్ స్టేషన్ (ఐఎన్ఎస్) డేగా ఉండడంతో భద్రత రీత్యా కూడా ఎయిర్ పోర్టులో సివిల్ ఆపరేషన్స్ నియంత్రణ కోసం తొలి నుంచీ నేవీ ఆలోచన చేస్తున్న విషయం తెలిసిందే.

సచివాలయాలతో పాలనలో కొత్త ఒరవడి

ప్రజాశక్తి - జి.మాడుగుల : గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో పరిపాలన కొత్త పుంతలు తొక్కిందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని జి.మాడుగుల -2,కోరాపల్లి సచివాలయాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాలన వ్యవస్థలో వినూత్న మార్పులకు సిఎం జగన్‌శ్రీకారం చుట్టారన్నారు. పాదయాత్రలోనూ, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీమేరకు పాలనలో సంస్కరణలు చేపట్టి, గ్రామ సచివాలయ, వాలంటీర్ వ్యవస్థలకు రూపకల్పన చేసి, పాలనను ప్రజలకు చేరువ చేశారన్నారు కార్యక్రమంలో జెడ్‌పిటిసి డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి, సర్పంచులు కిముడు రాంబాబు, మసాడి రాజులమ్మ, ఎంపిటిసిలు మత్స్యరాస విజయ కుమారి, అంగనైన నానాజీ, మండల అధ్యక్షులు నుర్మతి మత్స్యకొండంనాయుడు, వైసిపి ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు, జెసిఎస్ మండల కన్వీనర్ లంకెల కల్యాణ్, వైస్ ఎంపిపి కుడుముల సత్యనారాయణ, సర్పంచ్ ఫోరం అధ్యక్షులు సురభంగి రామకృష్ణ, పాంగి రామకృష్ణ, ఆంధ్రయ్య, లువ్వాసింగి ఎంపిటిసి గబ్బాడి సన్యాసి దొర, మత్స్యరాస గాయిత్రి, సర్పంచులు సీదరి కొండబాబు, మాలన్న, మసాడి కొండమ్మ, బి.వెంకటరమణ, వరలక్ష్మీ, ఎంపిటిసి కూడా చిన్నారావు, సీదరి రాంబాబు, కోటి బాబు, వంతల రాంబాబు, వాండ్లపు సూర్య ప్రకాష్ నాయుడు, ఎం.బాలన్న , వరహాల నాయుడు , నాయకులు గవేలి రమణబాబు మాతే వెంకటరమణ , పాంగి చిట్టిబాబు, అంగనైన వెంకటరమణ, జర్ర కొండబాబు, తమర్భ గంగన్న పడాల్, వంతల కృష్ణారావు, యవజన నాయకుడు చల్లంగి ప్రశాంత్ పాల్గొన్నారు.

సాగర అటవీప్రాంతంలో గుర్తు తెలియని మృతదేహం

ప్రజాశక్తి -డుంబ్రిగుడ : మండలంలోని సాగర పంచాయతీ అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైందని స్థానిక ఎస్ఐ సంతోషకుమార్ తెలిపారు. వివరాలివి. అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉందని స్థానికుల నంచి అందిన సమాచారం మేరకు కాలినడక అక్కడకు వెళ్లి మృతదేహన్ని సొవ్వా రోడ్డు వరకు మోసుకొచ్చామన్నారు. మృతుడి వయస్సు సమారు 50ఏళ్లు ఉంటుందన్నారు. మృతదేహన్ని అరకులోయ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించి భద్రపరిచినట్లు తెలిపారు.మృతుడి వివరాలు తెలిస్తే సమాచారం ఇవ్వాలనికోరారు.

బైక్ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి- పెదబయలు: బైక్ ప్రమాదంలో విజయనగరం జిల్లా గంట్యాడ మండలం నీలావతి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు తీవ్రగాయాల పాలయ్యారు. వివరాలివి. నీలావతి గ్రామానికి చెందిన సాయి, విజయ్ అనే ఇద్దరు యువకులు పాడేరు నుంచి ముంచంగిపుట్టు వైపు వెళుతుండగా, స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ జంక్షన్ మలుపు వద్ద ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో సాయి కుడికాలు విరిగి, తలు, ముఖంపై తీవ్రగాయాలు కాగా, విజయ్‌కు ముఖం, కాళ్లు, చేతులపై తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను మంగళవారం రాత్రి 8గంటల సమయంలో స్థానికులు స్పందించి, స్థానిక పిహెచ్‌సికి తీసుకెళ్లారు. ఇద్దరికి వైద్యసిబ్బంది చికిత్స చేస్తున్నారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని బాకూరు సచివాలయం పరిధిలో మంగళవారం ఎపికి జగన్ ఎందుకు కావాలంటే, పల్లెకు పోదాం కార్యక్రమం స్థానిక జెడ్‌పిటిసి రేగం మత్స్యలింగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈసందర్భంగా వైసిపి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సివేరి కొండలరావు, జెఎసి కన్వీనర్ కిల్లో రామకృష్ణ, వైసిపి మండల అధ్యక్షులు గెమ్మెలి కొండబాబు, బాకూరు సదాశివరాజు, జైరామ్, రాజారావు, మత్స్య రాజు, లంబన్న పాల్గొన్నారు.

నేడు చింతపల్లిలో బిర్సా ముండా జయంతి

ప్రజాశక్తి -చింతపల్లి: ఈనెల 15న స్థానిక మార్కెట్ యార్డులో బిర్సా ముండా149వ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు దండకారణ్య విమోచన సమితి (డిఎల్ఒ) జిల్లా అధ్యక్షులు కాంతారావు తెలిపారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏటా హుకుంపేటలోని దండకారణ్య విమోచన సమితి ముఖ్య కేంద్రంలో బిర్సాముండా జయంతిని నిర్వహించేవారమని, ఈ ఏడాది చింతపల్లిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమాన్ని డిఎల్ఓ స్థాపకులు చండా ఏలియా, ఒడిశా నుంచి లలిత్ నారాయణ హాజరవుతారని తెలిపారు దీనిపై చింతపల్లిలో విస్తతంగా ప్రచారం చేశారు. కార్యక్రమంలో దండకారణ్య విద్యార్థి విద్యార్థి సమితి రాష్ట్ర అధ్యక్షులు జాన్ శోభన్ దండకారణ్య ఉద్యోగ సంఘం సభ్యులు కావడం కాసులమ్మ పాల్గొన్నారు.